# కళాకారుల కుటుంబం

అతని పేరు అవిలేను.

వయస్సు ఇరవైలోపే. మధ్యతరగతిని ప్రతిబింబిస్తూంది అతని వేషం. మొనదేలిన అతని ముక్కు అతని ప్రవర్తనను, నిశితమైన అతని చూపులు చురుకుదనాన్ని, వేగంగా కదిలే అతని చేతికదలికలు నైపుణ్యాన్నీ సూచిస్తున్నాయి.

పది నిముషాలు తదేక దీక్షతో చేసిన అతని తపస్సు ఫలించింది. విజయసంకేతంలా అతని పెదవులపై చిరునవ్వు మెరిసింది. నుదుటపట్టిన చిరు చెమటను తుడుచుకుంటూ సాధించిన తపఃఫలాన్ని, ఎదురుచూస్తున్న పెద్దమనిషి చేతిలో పెట్టాడు.



ఆయన మొహం ఆనందంతో వెలిగిందొక్క క్షణం. అచ్చుగుద్దిట్లున్న తన పోలికల్ని అద్దంలో చూసుకున్నట్టనిపించింది. 'పది నిముషాల్లోనే పెన్సిల్‌తో అద్భుతం చేశాడే వీడు?!' అనుకున్నాడు. అంతలోనే అతనికేదో గుర్తొచ్చినట్లుంది. వెంటనే మొహం చిట్లించాడు -

"నాలా ఉందంటావా?" తన బొమ్మనే మరింత లోతుగా పరిశీలిస్తూ అనుమానం వ్యక్తం చేశాడు.

ఆ బొమ్మ గీసిన అవిలేను మొహంలో అసంతృప్తి లిప్తకాలం తొంగిచూసి, మాయమైంది. ఉలి తాకిడిని తట్టుకునే శిలలా ఇలాంటి మాటలతనికి అలవాటయ్యాయి. డబ్బులెగ్గొట్టాలనో, తన ప్రతిభను తక్కువ చేయాలనో బొమ్మ గీయించుకున్నవాళ్ళిలా మాట్లాడటం అతనికి పరిపాటే.

అంతలో నలుగురూ పోగయ్యారక్కడ. బొమ్మను చూశారు.

"మీదేనా? చాలా బాగుందే!"

"బలే గీసినావయ్యా!"

"మంచి ట్యాలెంటున్నది."

"వ్వాహ్ యార్! సూపర్బ్ ! నాది గీసిస్తావా?"

ఇన్నిరకాల కాంప్లిమెంట్స్ వచ్చినా, లోపల సంతోషంగా ఉన్నా, డబ్బులిచ్చేందుకు ఆ ఆసామి మనసొప్పుకోవడంలేదు. 'చూస్తూ - చూస్తూ-గీ పెన్సిల్ గీతలకు పదిరూపాయలివ్వాలా...?'

"పదిరూపాయలివ్వమంటావా?" 'తప్పదా?' అన్నట్టు అవిలేనును చూశాడు.

నవ్వలేక నవ్వాననిపించాడు అవిలేను. 'నీలాంటి వాళ్ళను చాలామందిని చూశాను.' అన్నట్టుందా నవ్వు.

లాటరీలో డబ్బులు పోగొట్టుకున్నవాడిలా మొహంపెట్టి తనవద్ద గల నోట్లలో నుండి అతి పురాతనమైన ఓ పది రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

అతని మొహం చూడకుండానే ఆ నోటు తీసుకొని జాగ్రత్తగా గుండెలమీదున్న జేబులో దాచుకున్నాడు.

ఆ బస్తీకి దగ్గర్లోని ఓ పల్లెటూరు అవిలేనుది. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం వాళ్ళది. తల్లిదండ్రులు కూలీ పనితో కుటుంబాన్ని లాక్కొస్తున్నారు. అతను పెద్దకొడుకు.

ఇద్దరు తమ్ముళ్ళూ, ఓ చెల్లి. వాళ్ళు వరుసగా ఇంటర్, తొమ్మిది, ఏడు తరగతుల్లో చదువుతున్నారు చెల్లి ఊళ్ళోనే, చిన్న తమ్ముడు పక్క ఊర్లో, పెద్దోడు ఇదే బస్తీలో.

బడిలో పాఠాలు సరిగ్గా చెప్పకపోవడమో, ఆసక్తి లేకపోవడమోగాని పదో తరగతి గట్టెక్కలేక పోయాడు అవిలేను. రెండేళ్ళు వాయిదా పద్ధతిలో పరీక్షలు రాసినా, ఇంగ్లీషు, లెక్కలు మాత్రం అందని ద్రాక్షపళ్ళే అయ్యాయి. తల్లిదండ్రులు 'తాము కష్టపడ్డా - పిల్లలు సుఖపడా'లన్న సూత్రానికి కట్టుబడి ఉండటం వల్ల కూలీపని కూడా చేతకాలేదు అతనికి. చేతిలో ఉన్న ఒక్క కళ డ్రాయింగ్. అటు చదువూ- ఇటు పనీ అబ్బకపోవడంతో డ్రాయింగే అతన్ని వదలని చెలికాడైంది. రాత్రీపగలూ అదే పని- అదేపని. శ్రమ వృథాకాలేదు. అలవోకగా బొమ్మలు గీసే శక్తిని సాధించాడు. కానీ, ఉన్న ఊళ్ళో గుర్తింపు లేదు. శ్రమకు తగ్గ ఫలితం లేదు. అడపాదడపా చచ్చిన పెద్ద మనుషుల బొమ్మలు గీయించుకుని, 'బాగా వచ్చిందోయ్!' 'నచ్చిందోయ్!' అంటూ మెచ్చుకున్నారు గాని, ఇచ్చిందేమీ లేదు.

మిత్రుల సలహాతో ఈ బస్తీలో పది రూపాయలకు బొమ్మ గీసిచ్చే పని మొదలెట్టాడు. రెండు మూడు రకాల మందం గల్గిన పెన్సిల్, జిరాక్స్ వైట్ పేపర్స్. ఒక ప్యాడ్, పాతసైకిల్. సైకిల్ మీద తమ్ముడ్ని తీసుకొచ్చి కాలేజీలో వదిలేస్తాడు. సాయంత్రం దాకా పార్కులో ఈ పని మళ్లీ సాయంత్రం తమ్ముడ్ని తీసుకొని ఊరికెళ్తాడు. సరాసరి రోజుకు 70-80 రూపాయలు వస్తాయి. వారం- వారం సంత జరుగుతుందక్కడ. ఆరోజు మాత్రం మూడు వందల దాకా వస్తాయి. కాని, రాబడి రాన్రానూ తగ్గుతూంది. ఆ రోజు అప్పటి వరకూ ఇరవై రూపాయలే అయ్యాయి. సైకిల్‌కి కొత్త ట్యూబ్ వేయించాలనుకున్నాడు. పైగా లేక లేక చెల్లి తనకి జూకాలు తెచ్చివ్వమని అడిగింది ఆ రోజు.

ఈ పద్ధతి ఇంక లాభంలేదు. చుట్టుపక్కల బస్తీల్లో కూడా సంత జరిగే రోజుల్లో అక్కడికెళ్లాలి. బాగా డబ్బులు సంపాదించాలి. ఒక స్టూడియో ఏర్పాటు చేసుకోవాలి.

"ఏయ్! పిలగా! మా పిల్ల బొమ్మదించింది నీవేనా?" ఖాళీ డబ్బాలో గులకరాళ్ళాడించి నట్టున్న ఆ శబ్దానికి ఉలిక్కిపడి వాస్తవం లోకొచ్చాడు అవిలేను.

ఎదురుగా ఓ దీర్ఘకాయుడు. అసలు సిసలు రాజకీయనాయకుడిలా ఉన్నాడు. పెరిగిన గడ్డం, బట్టతల- సినిమాల్లో విలన్ రాంరెడ్డిని తలపించేదిగా ఉంది.

బుర్ర విదుల్చుకొని చూశాడు. అతని వెనుకే ఓ అమ్మాయి భీత హరిణేక్షణలా

అమాయకంగా, భయంగా చూస్తోంది - తండ్రిని చాటు చేసుకొని, ఆకుచాటు పిందెలా, పదహారేళ్ళకు అటూ-ఇటూ వయసు.

తక్కున గుర్తొచ్చిందపి అవిలేనుకి. నిన్న మధ్యాహ్నం ఎవరూ లేని సమయం చూసి ఆ అమ్మాయి బొమ్మ గీయించుకుంది. వద్దన్నా వినకుండా యాభై రూపాయలు యిచ్చి వెళ్ళింది. ఆ... ఆమె పేరు స్రవంతి. ఆ చూపులు, మాటలు... తనపై అభిమానాన్ని చూపాయి. ఇప్పుడు... ఇలా.....

“ఏంది వయా మాట్లాడవ్?” ఎగా దిగా చూశాడతను.

గబుక్కున లేచి నిలుచున్నాడు అవిలేను. “నే.... నే.... నేనే సార్....!”

“శానా బాగా గీసినవ్ ! మంచి టాలెంటున్నది ! పైకొస్తవ్!” మెచ్చుకోలుగా అన్నాడు.

“ఎవర్నయినా నమ్ముబిడ్డా! రాజకీయనాయకుడ్ని నమ్మకు’ తండ్రి మాటలు గుర్తొచ్చాయి అవిలేనుకి. ఏదో భయం, అనుమానం అతని మనసునిండా కమ్ముకుంటే చేతులు కట్టుకొని నిల్చున్నాడు - అలాగే.

“నువ్వు నాకు నచ్చినావోయ్!” అన్నాడతను. అతని పేరు వీరభద్రయ్య.

స్రవంతి చిన్నగా నవ్వింది.

కంగారు పడ్డాడు అవిలేను.

“రేపొగసారి ఇంటికొచ్చి కలువ్.” అంటూ విజిటింగ్ కార్డిచ్చి వెళ్ళాడు.

“తప్పకుండా రావాలి!” తండ్రి నాలుగడుగులు వెళ్ళాక స్రవంతి గొంతు తగ్గించి చెప్పి, మళ్ళీ గబగబా తండ్రిననుసరించింది. మలుపు తిరిగే ముందు కూడా మరోమారు అవిలేనుని చూసింది.

అతనా చూపు మరచిపోలేదు.

0-0-0

ఏది కోరుకుంటామో అది నెరవేరదు. ఏది వద్దనుకుంటామో అదే జరుగుతుంది. వీరభద్రయ్యతో జరిగిన వ్యవహారమంతా తండ్రికి చెప్పాలనుకున్నాడు అవిలేను. కానీ చెప్పలేకపోయాడు. మరుసటి రోజు ఏదో శక్తి బలవంతంగా లాక్కెళ్ళినట్లు వీరభద్రయ్య ఇంటికెళ్ళాడు.

చిన్నపాటి రాజభవనం లాంటి యిల్లు. అక్కడి పనివాడితో తన పేరు, వచ్చిన సంగతీ చెప్పాడు. ఓ అరగంట తర్వాత స్రవంతి వచ్చింది.

" ఎంత సేపైంది వచ్చి?" ఆమె కళ్ళల్లో సంతోషం. మాటల్లో అభిమానం.

చెప్పాడు.

"సారీ! నాకిప్పుడే తెలిసింది. ప్లీజ్ కూర్చోండి!" అతను కూర్చునేదాకా వినలేదు.

"ఏం తీసుకుంటారు? టీ.... కాఫీ....!"

"ఏం వద్దండీ!" ఆమెను సూటిగా చూడలేక చూపు మరల్చుకున్నాడు.

"జెస్ట్ ఎ మినిట్!" అంటూ స్రవంతి లోపలికెళ్ళి మళ్లీ వచ్చింది.

మరు నిముషం బిస్కెట్లు, కాఫీ తీసుకొచ్చింది పనిమనిషి. తీసుకోకుంటే అమర్యాదగా ఉంటుందని, ఓ బిస్కెట్ తిని, కాఫీ తాగాడు. బిస్కెట్లన్నీ తినేస్తే బాగుండునన్న కోరికను అణచుకున్నాడు.

స్రవంతి క్షణం ఖాళీ లేకుండా ఏమేమో అడుగుతోంది. అతడు అన్య మనస్కంగానే సమాధానాలు చెబుతున్నాడు. మరుక్షణం ఏం జరుగబోతోందో.... అసలెందుకు పిలిపించాడో.... నన్న ఆలోచనలు అతడ్ని సవ్యంగా ఉండనీయడంలేదు.

ఇంతలో వీరభద్రయ్య వచ్చాడు, అవిలేను నిల్చున్నాడు.

"నీ పేరేమన్నావ్?"

చెప్పాడు. అతని పేరు ఎవ్వరికైనా ఒకటికి రెండుసార్లు వింటేగాని గుర్తుండదని తెలుసు.

"ఆ! అవిలేనూ నీ డ్రాయింగ్ శానా బాగున్నది. నీవు ఇక్కడ ఉండవలసినోడవు గాదు. హైదరాబాద్‌ల మా ఫ్రెండున్నాడు. శానా పెద్ద ఆర్టిస్టు. పేరు కృష్ణస్వామి.

చిన్నప్పుడు నీ తీరే బొమ్మలు గీసేవాడు. ఇంటర్ మద్దెన చదువాపేసి, హైదరాబాద్ పొయ్యిండు. ఇగ్రా అనే కంపెనీ పేరు విన్నావా?"

గుర్తుకు తెచ్చుకున్నాడు అవిలేను. "ఆ....! పెద్ద ఎద్ద అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు...."

"ఆ! ఆఁ ! గదే. అందుల పొయ్యి జేరిండు. బాగా కష్టపడ్డడు. ఇప్పుడాయన పెద్ద డిజైనర్. సీనియర్ ఆర్టిస్టు. అతనికింద యాభై, అరవై మంది దాకా పనిచేస్తుంటరు. ఆయన్ని

గలువు. గిట్ల వీరభద్రయ్య పంపించినాడని చెప్పు. గంతే! ఫ్యూచర్ శాన మంచి గుంటది." చెప్పడమైపోయినట్లు సెల్‌ఫోన్‌లో ఏదో నెంబరు నొక్కసాగాడు.

స్రవంతి తండ్రి చెవిలో ఏదో గొణిగింది.

"ఆఁ! టైమున్నప్పుడు మా యింటికొస్తావుండు. మా స్రవంతికి డ్రాయింగ్ శానా ఇష్టం. జెర నేర్పించు." అంటూ, కృష్ణస్వామి అడ్రసు డైరీలో ఉన్న విషయం స్రవంతికి చెప్పి, అతను హడావుడిగా వెళ్ళాడక్కడి నుండి.

స్రవంతి కృష్ణస్వామి అడ్రస్ వివరాలు చెప్పింది.

0-0-0

ఎన్నో కలలతో హైదరాబాద్ చేరి, కష్టపడి ఉప్పర్‌పల్లిలో ఉన్న కృష్ణస్వామిని కలిశాడు అవిలేను. కానీ, వీరభద్రయ్య చెప్పిందానికి, కృష్ణస్వామి మాటలకు పొంతనే లేనట్టనిపించింది అతనికి.

అతను చాలా కష్టపడి పైకొచ్చినవాడని, తనలాంటి వాడ్ని తప్పక ఆదరిస్తాడని, అన్ని విధాలా సహకరిస్తాడనీ చెప్పాడు వీరభద్రయ్య. కాని కృష్ణస్వామి వద్ద అవిలేనుకి ఏమాత్రం ఆదరణ లభించలేదు. కనీసం తను గీచిన బొమ్మల్ని చూడటానికైనా ఒప్పుకోలేదతను.

"బాబూ! నువ్వు నాకేమీ చెప్పొద్దు. ఇది హైదరాబాదు. ఇక్కడ ఉండటానికి క్షణానికొక రూపాయి కూడా చాలదు. మేమే ఈనగరం వదిలేసి పల్లెకు వెళ్ళాలనుకుంటున్నాం. వీరభద్రయ్య చెప్పినా, కాశీ విశ్వనాథుడు చెప్పినా నేను చెయ్యగలిగిందేమీ లేదు. తక్షణమే మీ ఊరెళ్ళిపో. వీలైతే వేరే పనేదైనా వెతుక్కో. నీ కళ నీకు తిండి పెడుతుందనుకోకు. ఇప్పుడు ఈ కళ కళకోసమే. భుక్తికోసం కాదు. ఇంతకు మించి నేనేమీ చెప్పలేను. నువ్వేమీ అడగొద్దు." అంటూ నిర్మోహమాటంగా వెనక్కి పంపించాడు.

అవిలేనుకి ఏడుపొచ్చింది. అసలే నగరం కొత్త. ఎవ్వరితోనూ తన గోడు చెప్పుకోలేక, ఎక్కడా ఉండలేక, వెనక్కి వెళ్ళడానికి మనసొప్పక విపరీతమైన ఆవేదనకు లోనయ్యాడు.

తల్లిదండ్రులకు, తోబుట్టువులకు, మిత్రులకు తను హైదరాబాద్ వెళ్తున్నానని, పెద్ద పెద్ద బోర్డులు పెయింట్ చేస్తానని, బాగా సంపాదిస్తానని చెప్పాడు. అంతా ఆనందించారు. అమ్మకు నచ్చజెప్పడమే కొంచెం కష్టమైంది. మిత్రులయితే మరో అడుగు ముందుకేసి "సినిమా

పోస్టర్లు కూడా గియ్యాలి. సినిమాటైటిల్స్‌లో డిజైనర్‌గా నిన్ను చూడాలి!" అంటూ ఉబ్బించారు. అన్నీ గుర్తుకొచ్చేసరికి దుఃఖమాగలేదు.

ఆ కృష్ణస్వామిని మరొకసారి కలిసి, తన గోడు చెప్పుకొని ఆయన కాళ్ళమీద పడి అయినా అవకాశం సాధించాలనుకున్నాడు. కానీ, అతనంత స్పష్టంగా, నిర్మొహమాటంగా చెప్పాక వెళ్లేందుకు మనసొప్పలేదు. పోనీ, ఎక్కడైనా, ఏ పెయింటర్ వద్దనయినా పనికి చేరదామని ఒకరోజు ఆగిపోయాడు. ఆ అనుభవం మరింత భయంకరమైంది.

రాత్రి రైల్వేస్టేషన్‌లో పడుకుంటే రైల్వే పోలీసులు బెదిరించారు. గూండా బిచ్చగాళ్ళు వేధించారు. రకరకాల మనుషులు సతాయించారు. చివరకో కూలీ దయతలచి, ఓ మూల చూయించాడు పడుకునేందుకు. జీవితంలో ఇంకెప్పుడూ రైల్వేస్టేషన్‌లో పడుకోరాదన్న సంగతి అర్థమైంది. పనికోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదుగాని, చాలా రోజుల నుండి కష్టపడి దాచుకున్న డబ్బు ఒక్క రూపాయి మిగలకుండా పోయింది. బ్యాటుకు తగిలిన బంతిలా హైదరాబాద్ నుండి ఇంటికి విసిరివేయబడ్డాడు. కోలుకునేందుకు వారం పట్టింది. మళ్ళీ షరా మామూలు. పార్కు - ప్యాడు - బొమ్మలు....

"ఒరే అవిలేనూ!" కారులో వెళ్తూ సడెన్‌గా చూసిన వీరభద్రయ్య పిలిచాడు.

అప్పుడే ఊరినుండి సైకిల్‌పై పార్కువైపు వస్తున్న అవిలేను సడెన్ బ్రేకు వేసి సైకిలొదిలి, కారు దగ్గరకి పరుగెత్తుకెళ్ళాడు. జరిగిందంతా తెలుసుకున్న వీరభద్రయ్య చాలా బాధపడ్డాడు.

"అట్లా కాదుగాని, నేను హైదరాబాద్‌కే ఎల్తున్న. నువ్వు నా యెంబడిరా!" అన్నాడు.

అవిలేను తటపటాయించాడు. సైకిల్ వాళ్ళింటివద్దే పెట్టించి, అవిలేనుని తనతో హైదరాబాద్‌కు తీసుకెళ్ళాడు వీరభద్రయ్య. అదృష్టవశాత్తూ ఆ సమయంలో కృష్ణస్వామి ఇంటి వద్దే ఉన్నాడు.

కుశల ప్రశ్నలయ్యాక వీరభద్రయ్య అవిలేను సంగతి కదిలించాడు- "గీ పిలగాడు నిన్ను కలిసిండంటగద!"

"కలిశాడు" అవిలేనుని చూశాడు కృష్ణస్వామి.

ఆ సంఘటన గుర్తుకొచ్చి తలవంచుకున్నాడు అవిలేను. కొద్దిసేపు ఏం మాట్లాడాలో తొచలేదు - కృష్ణస్వామికి.

"పిలగానిలో మంచి ఆర్టున్నది స్వామీ! నువ్వు జెర సపోర్టు జెయ్యి..." ఓ అయిదు నిముషాలు అవిలేను గురించి చెప్పాడు వీరభద్రయ్య.

"ఒక్క నిముషం! మీరు నా వెంబడి రండి!" వీరభద్రయ్యను అడ్డుకుంటూ చెప్పి, బయటకు దారి తీశాడు కృష్ణస్వామి. ఎక్కడికి, ఎందుకు అనే సందేహాలు తొలుస్తున్నా, మౌనంగా కృష్ణస్వామిని అనుసరించారు ఇద్దరూ. సుమారు ఓ ఫర్లాంగు దూరం నడిచాక అక్కడో దృశ్యం చూయించాడు.

చిన్న ఓపెన్ ఏరియా ఉందక్కడ. ఓ డజను మంది దాకా క్రికెట్ ఆడుతున్నారు. అయితే వాళ్ళంతా ఒకే ఏజ్ గ్రూపువాళ్ళు కాదు. 10 నుండి నలభై దాకా వేర్వేరు వయస్సుల్లో ఉన్నారు. లుంగీ, బనియన్, షార్ట్స్ - రకరకాల క్యాజువల్స్, ఓ చెక్కబ్యాటు, రబ్బరు బంతి, గనేట్ రాళ్ళను బొత్తులుగా పెట్టి 'వికెట్లు' అనిపించారు.

ఈ దేశంలో ఏ వీధిలోనైనా హాలీడే రోజు కనిపించే సాధారణ దృశ్యమే అది. కాకపోతే ఇక్కడ ఆడుతున్న వాళ్ళు వేర్వేరు వయస్సుల వాళ్ళు ఎక్కువమంది ఉండటం ప్రత్యేకత. కృష్ణస్వామి ఆ దృశ్యం ఎందుకు చూయించాడో అర్థంగాక మొహాలు చూసుకున్నారు వీరభద్రయ్య, అవిలేను. అదే అడిగాడు వీరభద్రయ్య.

"అక్కడ క్రికెట్ ఆడుతున్న వాళ్ళంతా మా వాళ్ళే. తమ్ముళ్ళూ, బావమరదులు, కొడుకులు, అల్లుళ్లూ....

ఏడాది కింద ఒకర్నొకరు పలకరించుకునేందుకు కూడా టైం దొరికేది గాదు. నెలకొకసారైనా ఆడుకునేందుకు అవకాశం దొరికితే సంబరపడేవాళ్ళు. ఇప్పుడు వారంలో అయిదు రోజులూ ఇదే పని. ఆటలో ఆసక్తితోనో, టైంపాస్ కోసమో వాళ్ళు ఆడటంలేదు. పని లేదన్న బాధ మరచిపోయేందుకు ఆడుతున్నారు. ఆట బాధను మరిపిస్తుందేమోగానీ, ఆకలిని చల్లార్చదు. వీళ్ళతోపాటు వీళ్ళను నమ్ముకున్న మరికొందరి కడుపుమంటకు సమాధానం చెప్పదు. ఇప్పటికి పర్వాలేదుగాని ఇలాగే మరో నాలుగురోజులు గడిస్తే...." ఒక్క క్షణం గొంతు మూగబోయినట్లైంది కృష్ణస్వామికి. తమాయించుకొని మళ్లీ చెప్పసాగాడు.

"వీళ్ళంతా నన్ను నమ్ముకొని, ఊరూ - వాడా వదిలేసి ఇక్కడికొచ్చారు. ఇప్పుడు వీళ్ళ భవిష్యత్తు ....?" నిశ్శబ్దంగా కళ్ళు తుడుచుకున్నాడు.

వీరభద్రయ్యకు చాలా వరకు విషయం అర్థమైంది. అవిలేనుకు అర్థమయ్యీ కానట్టుంది. మళ్ళీ నిశ్శబ్దంగా ముగ్గురూ కలిసి కృష్ణస్వామి ఇంటికొచ్చారు.

"ఇంతకూ ఈ పరిస్థితెందుకొచ్చింది స్వామీ?" అడిగాడు వీరభద్రయ్య.

వెంటనే సమాధానం చెప్పలేదు కృష్ణస్వామి. ఓ నిట్టూర్పు విడిచి చెప్పసాగాడు - "మా ప్రారబ్ధం. కంప్యూటర్లొచ్చి మా కడుపులు కొడ్తున్నాయనేది మాత్రం నిజం. మేం పదిమందిమి చేయాల్సిన పని అది ఒక్క గంటలో చేసేస్తుంది. ఆర్టిస్టుగాకపోయినా దాన్ని ఉపయోగించే తెలివిగలవాడు ఆపని చేయగలడు. ఆ టెక్నాలజీ డిజైను, ప్రింటు కావలసిన సైజులో అందంగా తయారువుతుంది. హోర్డింగులే కాదు, సైన్‌బోర్డులూ ఇప్పుడు దాని ద్వారానే తయారవుతున్నాయి. మ్యానువల్ వర్క్ పూర్తిగా పడిపోయింది. కళాకారుల కుటుంబంగా పేరు పడ్డ మేము, మొన్న మొన్నటి దాకా కళకళలాడిన మేము - ఇప్పుడు కళ్ళల్లో ప్రాణం పెట్టుకొని బతుకులీడుస్తున్నాం. ఒకప్పుడు మాతోపాటు వందలమందికి పని దొరికేది. నాచేతి కింద పనిచేసేవాళ్ళే కొన్ని కుటుంబాలుగా ఏర్పడ్డవాళ్ళున్నారు. వాళ్ళ పరిస్థితిప్పుడు చాలా భయంకరంగా ఉంది.

"ఒకప్పుడు చేనేత పని కార్మికులు, చేతివృత్తి కళాకారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే అర్థమయ్యేది కాదు. కాని ఇప్పుడు క్యాజువల్ పెయింటర్స్ కూడా అంత కంటే దయనీయమైన పరిస్థితుల్లో కొట్టుకుంటున్నారు. నాలుగైదేండ్ల క్రితం దాకా మా పరిస్థితి బాగానే ఉంది. చాలా మంది ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. కష్టపడి ఎంతో కొంత ఆస్తుల్నీ కూడబెట్టుకున్నవాళ్లూ ఉన్నారు. కానీ, మా కలలన్నీ కాలి బూడిద కావడానికి అప్పటికే చితులంటుకున్నాయన్న సంగతి గ్రహించడానికి మా తెలివి చాలాలేదు."

"డ్రాయింగ్ నేర్చుకున్నోళ్ళు స్కూళ్ళల్ల టీచర్లు కూడా కావచ్చు గద స్వామీ? మా చిన్నప్పుడు స్కూళల్ల డ్రాయింగ్ మాస్టరుండేవాడు. శానా బాగా నేర్పిస్తుండె...." వీరభద్రయ్య సందేహం.

"అదీ అయ్యింది. మా చిన్న తమ్ముడిని, పెద్దకొడుకునూ డ్రాయింగ్ పరీక్షలు రాయించి, టీచర్ ట్రెయినింగ్ జేయించాను. కాని, హైస్కూళ్లలో డ్రాయింగ్ పోస్టుని తప్పనిసరి చేసిన ప్రభుత్వమే గత **14** సంవత్సరాల నుంచి ఆ సంగతే పట్టనట్లు వ్యవహరిస్తున్నది. అంతరిస్తున్న జీవజాలంలో డ్రాయింగ్ మాస్టర్లని కలిపేసింది."

వింటున్న ఇద్దరి గుండెల్లో కలుక్కుమంది.

"మాది వ్యాపారం కాదు. మేం ఉద్యోగులం కాదు. ఏ సమ్మెలూ, ఉద్యమాలూ చేయలేని అకేషనల్ వర్కర్స్‌మేము. కూలీలకైనా హక్కులున్నాయి. మాకు దిక్కేది?"

ఉద్వేగ నియంత్రణకు సమయం పట్టింది - కృష్ణస్వామికి.

"మాలో కొందరు తెలివైనవాళ్ళు ఇప్పటికే వేరే పనుల్లో చేరిపోయారు. ఇంకొందరు మనసు చంపుకొని అడ్డమైన పనులూ చేస్తున్నారు. మేమే వేరే పని రాక, దీన్ని వదులుకోలేక..... జీవచ్ఛవాల్లా"

"మరి ఆ కంప్యూటర్ పని మీరే నేర్చుకుంటే?" - వీరభద్రయ్య.

"అది పని కాదు. వ్యాపారం. లక్షల రూపాయల ఖర్చుతో కూడుకున్నది. మా కంపెనీలే ఆ పనిలో కిందా మీదా పడుతున్నాయి. మా చిన్నబ్బాయికి అదీ నేర్పించాం. అది కొంత ఆదుకుంటుందనేదీ నిజమే. కాని, అదేపాటి?"

ఏదో అడగబోయాడు వీరభద్రయ్య. అతని భావాన్ని గ్రహించినట్టు మళ్ళీ చెప్పసాగాడు స్వామి -

"ఈ సంగతులన్నీ ఆరోజే ఈ అబ్బాయికి చెప్పాల్సింది. కాని, అప్పుడు నేను ఇరవైవేల కాంట్రాక్టు పోగొట్టుకున్న బాధలో ఉన్నాను. పని దొరకక నష్టానికి సైతం పనిచేసే దుర్దశలో ఉన్నాం. అదీ ఓ దుర్మార్గుడు కొట్టేశాడు. ఆ బాధలో కఠినంగా మాట్లాడాను. ఆ తర్వాత నా తప్పు తెలిసి ఇతనికోసం వెతికాను. కనబడలేదు. మళ్ళీ కలుస్తాడేమో, అన్నీ నెమ్మదిగా నచ్చజెప్పాలనుకున్నా...." భారంగా కళ్ళు మూసుకున్నాడు కృష్ణస్వామి.

అవిలేను గుండె చెమ్మగిల్లింది.

వీరభద్రయ్యలేచాడు. అవిలేనూ సిద్ధమయ్యాడు.

"కళ గొప్పదే. దాన్ని సాధించేందుకోసం జీవితాలను అంకితం చేయగల్గితే అదృష్టమే. కాని, పొట్ట కూటికోసం తన్నులాడుకునే మనం అది సాధించే పరిస్థితులు ముందు కనుక్కోవాలి. మనలో కొందరినైనా బతికించుకోవాలి. ఈపని ఎవరో చేస్తారనుకోవడం ఉత్తిదే...."

కృష్ణస్వామి మాటలు చెవుల్లో నిరంతరం మార్మోగుతుండగా ఇల్లు చేరుకున్నాడు అవిలేను. అక్కడ తెల్లకాగితాలూ, పెన్సిళ్ళూ అతనికోసం అమాయకంగా ఎదురుచూస్తున్నాయి. ❖

(31 జనవరి 2005 జాగృతి వారపత్రిక)